క్లుప్తంగా

వైభవంగా రావులమ్మ తీర్థం



రావులమ్మ

అంబాజీపేట: గంగలకుర్రులో వేంచేసిన రావులమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి గ్రామ ఆడపడుచులు ముడుపులు, మొక్కులు, కానుకలు, చలివిడి పానకాలు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు ఆలయ ప్రాంగణంలో తీర్థప్రసాదాలు అందజేశారు. సోమవారం రాత్రి అమ్మవారి జాతర ఘనంగా జరిపారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: మండలంలోని పీహెచ్‌సీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రతి రోగి సద్వినియోగం చేసుకోవాలని ముక్కామల పీహెచ్‌సీ వైద్యాధికారి జీవీ గీతాంజలి అన్నారు. వక్కలంకలో ఆరోగ్య సురక్ష రెండో విడత మంగళవారం నిర్వహించారు. 40 ఏళ్లు దాటిన వారంతా బీపీ, సుగర్ పరీక్షలు చేయించుకోవాలని వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఏమైనా దీర్ఘకాలిక రోగాలు ఉన్నట్లయితే ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం రోగులను, గర్భిణులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎ.రాధానరసింహం, హెల్త్ అసిస్టెంట్‌లు ప్రసాద్, వెంకటేష్, ఆరోగ్య మిత్ర ధనరాజ్, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, ఏఎన్‌ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు ఎండుగడ్డి వితరణ



ఎండుగడ్డి వితరణ చేసిన దాతలతో అంతర్వేది గోశాల సిబ్బంది

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలోని గోశాలకు మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా పి.వేమవరానికి చెందిన దాతలు పి.నాని, జి.సుబ్బారావులు ట్రాక్టర్ ఎండుగడ్డి అందజేశారు. ఈ మేరకు ఆలయ సిబ్బందికి ఈ గడ్డిని అప్పగించారు. సేవా బృందం సభ్యులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో తాగునీటిపై చర్చ



తాగునీటి సమస్యపై ప్రశ్నిస్తున్న సర్పంచ్ అడబాల తాతకాపు

మామిడికుదురు: ఆదుర్రు, లూటుకుర్రు గ్రామాల్లోని ట్యాంకులకు తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని రెండు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు బళ్ల శ్రీనివాస్, అడబాల తాతకాపు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మండల పరిషత్ అధ్యక్షురాలు కుసుమ వనజకుమారి అధ్యక్షతన మంగళవారం మామిడికుదురు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీఓ ఎస్.గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలు అంశాలను చర్చించారు. మామిడికుదురు-గోగన్నమఠం ఆర్‌అండ్‌బీ రోడ్డును తవ్వేసి వదిలేశారని, దాని వల్ల ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో నామమాత్రంగానే సమావేశాన్ని నిర్వహించారు. పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశంలో పాల్గొన్నారు.

ఎంపిక చేసిన పాఠశాలల్లో శ్లాస్ పరీక్ష



పల్లిపాలెం ఆశ్రమ ప్రభుత్వ పాఠశాలలో శ్లాస్ పరీక్ష నిర్వహిస్తున్న బోధన సిబ్బంది

సఖినేటిపల్లి: మండలంలో ఎంపిక చేసిన ఐదు ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం నాలుగో తరగతి పిల్లలకు శ్లాస్ (స్టూడెంట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్షలు ఓఎంఆర్ విధానంలో నిర్వహించినట్టు ఎంఈవో-1, 2 డి.కిషోర్ కుమార్, మద్దాలి వెంకటేశ్వరరావు తెలిపారు. శ్లాస్ సర్వే ద్వారా విద్యార్థులు సాధించిన అభ్యసన సామర్థ్యాలను తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు పల్లిపాలెం ఆశ్రమ పాఠశాలలో ఈ పరీక్షను బి.కిషోర్ నిర్వహించారు. హెచ్‌ఎం రత్నరాజు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు. కాగా పల్లిపాలెం ఆశ్రమ పాఠశాలతో పాటు మూలగొంది ఎంపీపీఎస్, రామేశ్వరం, అంతర్వేదిపాలెం, మోరి ఉన్నత పాఠశాలలు ఉన్నాయని ఎంఈవోలు తెలిపారు.

సీతారాముల కల్యాణం చూతము రారండి

- నేడు శ్రీరామనవమి
- రామాలయాల్లో వేడుకలకు సర్వం సిద్ధం



రావులపాలెంలో ముస్తాబైన రామాలయం

కొత్తపేట: తెలుగు సంవత్సరాది అనంతరం తొలి హిందూ సంప్రదాయ పర్వదినం శ్రీరామనవమి. చైత్రశుద్ధ నవమి నాడు శ్రీరామనవమి జరుపుకొంటారు. రామాలయం లేని గ్రామం ఉండదంటే అతిశయోక్తి కాదు. ప్రతి గ్రామంలోనూ, శివారు గ్రామాల్లోనూ రామాలయాలు ఉంటాయి. శ్రీరామనవమి వస్తోందంటే ఆయా గ్రామాల్లో రామాలయాలు కల్యాణ సందడితో కళకళలాడతాయి. రాములవారి పెళ్లికి ఊరంతా సంబరాలు అన్నట్టుగా నిర్వహిస్తారు. బుధవారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలో గ్రామగ్రామాన రామాలయాలు, ఆంజనేయస్వామి వారి ఆలయాలు, పలు విష్ణాలయాలు, వేంకటేశ్వర స్వామివారి ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలకు, శ్రీసీతారాముల కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా ఆయా ఆలయాలు చలువ పందిళ్లు, పచ్చని తోరణాలతో కళకళలాడుతున్నాయి.

పలుచోట్ల భారీ ఏర్పాట్లు

శ్రీరామనవమి సందర్భంగా పలు ప్రాంతాల్లోని రామాలయాల వద్ద భారీ ఏర్పాట్లు చేశారు. కొత్తపేట శ్రీకోదండరామాలయం (కొత్తరామాలయం) వద్ద భద్రాచలంలో సీతారాముల కల్యాణం ఏ సమయానికి నిర్వహిస్తారో అదే సమయానికి నిర్వహించడం ఆనవాయితీ. భద్రాచలంలో కల్యాణోత్సవం తరహాలో ఇక్కడ కల్యాణం నిర్వహిస్తారు. దాంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా ఇక్కడకు అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకిస్తారు. ఈ ఆలయంతో పాటు స్థానిక శ్రీరామనగర్ రామాలయం, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల్లోని పలు ఆలయాల్లో రాముల వారిని, సీతమ్మవారిని కల్యాణమూర్తులుగా అలంకరించి పండితుల వేదఘోష నడుమ భక్త దంపతులు పీటలపై కూర్చుని శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహిస్తారు. పలువురు భక్తులు కల్యాణానికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారు. ప్రతి చోటా భక్తులకు విసనకర్రలు, పానకాలు, చలివిడి, వడపప్పు, పులిహోర ప్రసాదంగా పంపిణీ చేస్తారు. పలుచోట్ల భారీ అన్న సమారాధనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఆలయాల ముస్తాబు

అంబాజీపేట: శ్రీరామ నవమిని పురస్కరించుకొని బుధవారం ఘనంగా నిర్వహించేందుకు ఆలయాలను ముస్తాబు చేశారు. అంబాజీపేట, మాచవరం, గంగలకుర్రు, ముక్కామల, గంగలకుర్రు అగ్రహారం, మొసలపల్లి, ఇసుకపూడి, చిరతపూడి, వక్కలంక, కేవీ లంక, నందంపూడి, వాకలగరువు, తొండవరం, నందంపూడి, కె.పెదపూడి, ఇరుసుమండ, పసుపల్లి గ్రామాల్లో ఉన్న దేవాలయాలకు నిర్వాహకులు ఆలయాలను సర్వాంగ సుందరంగా విద్యుత్ దీపాలతో అలకరించారు. శ్రీరామనవమి వేడుకకు అధిక సంఖ్యలో హాజరయ్యే భక్తులకు వేసవి తాపం లేకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణాల వద్ద పోటాపోటీగా పానకాలను సిద్ధం చేస్తున్నారు. కొన్ని ఆలయాల వద్ద భారీ అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు.

స్పందించారు..



బందారువారి వీధి ఎదురుగా చెట్టుకు ఉన్న బీజేపీ జెండాను తొలగించిన దృశ్యం

అంబాజీపేట: స్థానిక బందారువారి వీధి ఎదురుగా ప్రధాన రహదారి పక్కనే ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా చెట్టుకు ఉన్న బీజేపీ జెండాను అధికారులు స్పందించి మంగళవారం తొలగించారు. ఈ నెల 16న 'సాక్షి' దినపత్రికలో కోడ్ వర్తించదా? అనే వార్తా కథనం వెలువడింది. దీంతో సంబంధిత శాఖ అధికారులు స్పందించి బీజేపీ జెండాను తొలగించారు.

సీఎంకు ప్రజల్లో తిరుగులేని ఆదరణ



పాశర్లపూడిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రాపాక, విప్పర్తి

మామిడికుదురు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో తిరుగులేని ఆదరణ లభిస్తోందని అమలాపురం పార్లమెంటు ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు పేర్కొన్నారు. పాశర్లపూడి, మొగలికుదురు గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారంలో ఇద్దరు అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. భారీ బైక్ ర్యాలీ నడుమ పార్టీ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో ఎన్నికల ప్రచార ర్యాలీలో పాల్గొన్నారు. పలు సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఒక్కరికీ ఆర్థికంగా అండగా నిలుస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నారని, జగన్‌ను తట్టుకోవడం ఎవరి తరం కాదన్నారు. జగన్ పేరు చెబితేనే ప్రతిపక్షాలకు వణుకు పుడుతుందని వరప్రసాదరావు, వేణుగోపాలరావు పేర్కొన్నారు. వచ్చే నెలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘనవిజయం సాధించబోతుందన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రజలు అడగడుగునా బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. జగన్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఎక్కడా మాట తప్పలేదు, మడమ తిప్పలేదన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాస్, పార్టీ నాయకులు కొనుకు ప్రేమజ్యోతి, తోరం సూర్యభాస్కర్, చిక్కం బుజ్జిబాబు, మొల్లేటి త్రిమూర్తులు, తోలేటి ఆదినారాయణమూర్తి, నెల్లి దుర్గాప్రసాద్, అంకాని వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌కు చేరుకున్న ఈవీఎంలు

పి.గన్నవరం: ముంగండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలు మంగళవారం రాత్రి చేరుకున్నాయి. వీటిని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీరామచంద్ర మూర్తి, రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. సోమవారం రాత్రి పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలు వచ్చిన విషయం విదితమే. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీఐఎస్‌ఎఫ్ సిబ్బందితో భద్రతా చర్యలు చేపట్టినట్టు ఆయన వివరించారు. ఏఆర్‌ఓలు షేక్ హుస్సేన్, లక్ష్మీప్రమద్వర, మేరీకమ్మ, ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి, ఎస్సై బి.శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

పి.గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ తరగతులకు హాజరవుతున్న 45 మంది విద్యార్థులకు ముక్తేశ్వరం వైవీఎస్ అండ్ బీఆర్‌ఎం పాలిటెక్నిక్ కళాశాల యాజమాన్యం మంగళవారం స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేసింది. సమావేశంలో అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. అసోషియేషన్ సభ్యులు కడలి శ్రీను, కొల్లాటి రవికుమార్, కడలి శివరామకృష్ణ, ఎంవీ రమణ, మట్టపర్తి రాము తదితరులు పాల్గొన్నారు.

పల్లెపల్లెకూ గొల్లపల్లి ప్రచారయాత్రకు అపూర్వ స్పందన



సఖినేటిపల్లిలంకలో ప్రచార యాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గొల్లపల్లి, రాపాక

సఖినేటిపల్లి: మండలంలో తీర ప్రాంత గ్రామాల్లో మంగళవారం పల్లెపల్లెకు గొల్లపల్లి ప్రచార యాత్రకు అపూర్వ స్పందన వచ్చింది. వైఎస్సార్ సీపీ రాజోలు అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు, అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు సంయుక్తంగా చేపట్టిన ఈ ప్రచార యాత్ర ప్రభంజనం సృష్టించింది. యాత్ర పొడువునా ఫ్యాన్ గుర్తుకే ఓటు వేద్దాం, జగనన్ననే ముఖ్యమంత్రి తిరిగి చేసుకుందాం అంటూ అభ్యర్థులు గొల్లపల్లి, రాపాక చేతులు జోడించి ఓటర్లను ఓట్లు అభ్యర్థించిన తీరు విశేషంగా ప్రజలను ఆకట్టుకుంది. తొలుత సఖినేటిపల్లిలంక గ్రామానికి వేర్వేరు గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివచ్చారు. నిర్ణీత సమయానికి సఖినేటిపల్లిలంకలో ప్రచార యాత్ర రథానికి గొల్లపల్లి, రాపాక కొబ్బరికాయలు కొట్టి యాత్ర ప్రారంభించారు. గ్రామం నుంచి ప్రారంభమైన ఈ ప్రచార యాత్ర ఉదయం సఖినేటిపల్లి, రామేశ్వరం, గుడిమూల గ్రామాల్లో సాగింది. మధ్యాహ్నం గొంది, పల్లిపాలెం, అంతర్వేది దేవస్థానం, అంతర్వేదికరలో ఈ ప్రచార యాత్ర సాగింది. దారి పొడవునా ప్రజలు వైఎస్సార్ సీపీకి మద్దతు పలుకుతూ నినాదాలు చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి జంపన బుజ్జిరాజు, సీనియర్ నాయకులు కేఎస్‌ఎన్ రాజు, గొల్లపల్లి శ్రీధర్, జాన శంకరరావు, జెడ్పీటీసీలు దొండపాటి అన్నపూర్ణ, బళ్ల ప్రసన్నకుమారి, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైఎస్ ఎంపీపీలు రాపాక దీవెన కుమారి, రుద్రరాజు చిన రాజా, కో ఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



వైఎస్సార్ సీపీ చేరిన వారికి పార్టీ కండువాలు కప్పుతున్న పి.గన్నవరం అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు



పార్టీలోకి చేరిన ఊబలంక ఎస్సీ కుటుంబాల వారిని అభినందిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

మామిడికుదురు: పాశర్లపూడి, పాశర్లపూడిలంక, అప్పనపల్లి గ్రామాలకు చెందిన పలువురు మంగళవారం టీడీపీ, జనసేనకు రాజీనామా చేసి వైఎస్సార్ సీపీలో చేరారు. పాశర్లపూడిలంక మాజీ సర్పంచ్ బొంతు అమరావతి, తాడి కోటేశ్వరరావు, ఉంద్రు సూరిబాబు, శ్రీధర్, పాలమూరి వెంకటేశ్వరరావు తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు. పాశర్లపూడికి చెందిన టీడీపీ, జనసేనకు చెందిన మద్దుల సత్యనారాయణ, కట్టా శ్రీనివాస్, పీతల శేఖర్‌బాబు, ఉల్లంపర్తి సత్యనారాయణ, ముస్కూడి జాన్, మల్లవరపు సత్యనారాయణ, అప్పనపల్లిలో టీడీపీ నుంచి కడలి భాస్కరరావు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పి.గన్నవరం అసెంబ్లీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కూటమిపై ప్రజల్లో రోజు రోజుకు విశ్వాసం సన్నగిల్లుతోందని, అందుకే టీడీపీ, జనసేనకు చెందిన నేతలు ఆయా పార్టీలకు రాజీనామా చేసి వైసీపీలో చేరుతున్నారని విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. జగన్ నాయకత్వాన్ని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని, ప్రజల ఆదరాభిమానాలతో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందన్నారు.

కొత్తపేటలో ఎగరబోయేది వైఎస్సార్ సీపీ జెండాయే

రావులపాలెం: ఎంత మంది కలిసి వచ్చినా ఎంత మంది ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట్రంలో మరలా ముఖ్యమంత్రిగా గెలుపొందేది జగన్‌మోహన్‌రెడ్డేనని, కొత్తపేట నియోజకవర్గంలో నాలుగోసారి ఎమ్మెల్యేగా చిర్ల జగ్గిరెడ్డినే గెలిపించుకుంటామని రావులపాలెం మండలం ఊబలంక గ్రామంలో సుమారు వంద ఎస్సీ కుటుంబాలు స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలో చేరారు. మంగళవారం స్థానికంగా జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరిన అందరినీ కొత్తపేట వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి ఆప్యాయంగా పలకరిస్తూ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి రహితంగా ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన ప్రజలందరికీ గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా నేరుగా ప్రజల ఇంటివద్దకే అందించారన్నారు. అలాంటి పాలనే ప్రజలు మరలా కోరుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారందరినీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అభినందించారు.

సంక్షేమ పథకాలతో పెరిగిన ప్రజాదరణ

వైఎస్సార్ సీపీ అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక



కొత్తపేటలో ఎంపీ అభ్యర్థి రాపాకను సత్కరిస్తున్న డేవిడ్‌రాజు

కొత్తపేట: రాష్ట్ర చరిత్రలోనే కాక దేశ చరిత్రలోనే ఎప్పుడూ కనీవినీ ఎరుగని రీతిలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో ఎక్కడికి వెళ్లినా మంచి ప్రజాదరణ లభిస్తుందని రాజోలు ఎమ్మెల్యే, అమలాపురం పార్లమెంటు వైఎస్సార్ సీపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్ అన్నారు. మంగళవారం సాయంత్రం రావులపాలెంలో ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే, అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డితో కలిసి పాల్గొనేందుకు వెళుతూ కొత్తపేటలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజును మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా రాపాకను డేవిడ్‌రాజు ఆయన తనయుడు, దళిత యువజన నాయకుడు స్వరూప్‌రాజ్ శాలువాతో సత్కరించారు. కొత్తపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గిరెడ్డికి, ఎంపీ అభ్యర్థిగా మీకు అత్యధిక మెజార్టీ వస్తుందని వారు భరోసా ఇచ్చారు. రాపాక వరప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక లబ్ధి పొందిన ప్రజలు మళ్లీ జగన్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం కనిపిస్తుందన్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి వచ్చిన స్థానాలకు మించి ఈసారి ఘనవిజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బెజవాడ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ



రాజకీయ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఓ శ్రీరామచంద్రమూర్తి

పి.గన్నవరం: పి.గన్నవరం అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి ఈనెల 18 నుంచి 25 వరకూ తమ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తామని రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిబంధనలను ఆయన వివరించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. 26న నామినేషన్ల పరిశీలన జరుగుతుందన్నారు. 29 వరకూ నామినేషన్ల ఉప సంహరణకు అవకాశం ఉందన్నారు. మే 13న ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎన్నికల సంఘం సూచించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే ఆర్‌ఓ కార్యాలయంలోకి అనుమతి ఉందన్నారు. ఆర్‌ఓ కార్యాలయానికి 100 మీటర్ల లోపు ఎటువంటి వాహనాల రాకపోకలకు అనుమతి లేదన్నారు. సమావేశంలో ఏఆర్‌ఓలు షేక్ హుస్సేన్, జె.విమల కుమారి, మేరీకమ్మ, ఎంపీడీఓలు సీహెచ్ త్రిశూలపాణి, టి.సత్యనారాయణమూర్తి, డీటీ దేవళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

18న అమలాపురం వెంకన్న కల్యాణం



అమలాపురం పెళ్లిళ్ల వెంకన్న ఆలయంలో స్వామి, అమ్మవార్లు

అమలాపురం టౌన్: కోనసీమ పెళ్లిళ్ల వెంకన్నగా పేరుగాంచిన అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 15వ తేదీన ప్రారంభమైన స్వామివారి కల్యాణోత్సవాలు 24వ తేదీతో ముగియనున్నాయి. రోజుకో పూజా క్రతువుతో, సాంస్కృతిక కార్యక్రమాలతో పది రోజుల పాటు ఈ కల్యాణోత్సవాలు జరగనున్నాయి. ఈ నెల 18వ తేదీ గురువారం ఉదయం 11.04 గంటలకు స్వామివారి దివ్య కల్యాణం, అదే రోజు రాత్రి గరుడ వాహనోత్సవం వైభవంగా నిర్వహిస్తామని ఆలయ చైర్‌పర్సన్ దూడల విరీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబు తెలిపారు. 19వ తేదీన ఆలయ ప్రాంగణంలో తీర్థం, అదే రోజు సాయంత్రం 4.02 గంటలకు పురవీధుల్లో రథోత్సవం జరుపుతామన్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 8.26 గంటలకు స్వామి వారిని పెండ్లి కుమారుణ్ణి, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలను చేసే తంతును అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం 4.53 గంటలకు ఎదురు సన్నాహ కార్యక్రమం జరిగింది. స్వామివారి కల్యాణం సందర్భంగా గురువారం మధ్యాహ్నం భక్తుల కోసం అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు. 20వ తేదీ పొన్న వాహనోత్సవం, 21న సదస్యం, శేష వాహనంపై తెప్పోత్సవం, అశ్వగంధర్వ వాహనోత్సవం, 22న ఆంజనేయస్వామి వారి వాహనోత్సవం, 23న పూర్ణాహుతి, చక్ర స్నానం, చివరి రోజు 24వ తేదీన బుక్కా ఉత్సవం, ఉయ్యాల సేవోత్సవం, శ్రీపుష్పోత్సవం క్రతువులతో కల్యాణోత్సవాలు ముగుస్తాయని ఆలయ చైర్‌పర్సన్ విరీతాదేవి తెలిపారు. భక్తులు తరలి వచ్చి స్వామివారి కల్యాణోత్సవాలను తిలకించి స్వామి,అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని ఈవో, చైర్‌పర్సన్ విజ్ఞప్తి చేశారు.

ఏపీవో ప్రసాద్‌కు జిల్లా అవార్డు



పీడీ మధుసూదన్ నుంచి జిల్లా ఉత్తమ ఏపీవో అవార్డు అందుకుంటున్న దుర్గా నాగప్రసాద్

సఖినేటిపల్లి: స్థానిక ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో దుర్గా నాగప్రసాద్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉత్తమ ఏపీవో అవార్డు దక్కింది. డాక్టర్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో భాగంగా సోమవారం ముమ్మిడివరంలో డ్వామా కార్యాలయంలో ఆ శాఖ పీడీ మధుసూదన్ చేతులు మీదుగా అవార్డు అందుకున్నట్టు మంగళవారం ప్రసాద్ తెలిపారు. మండలంలో ఈ పథకంలో మొత్తం 3,005 కుటుంబాలు ఉండగా, ఇందులో జిల్లాలోనే అత్యధికంగా 1407 కుటుంబాలకు వంద రోజులు పని దినాలు కల్పించినందుకు పై అవార్డు ఇచ్చినట్టు ప్రసాద్ అన్నారు.

యానాంలో 144 సెక్షన్

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి ఈ నెల 19న పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో యానాం రీజియన్‌లో సైతం 144 సెక్షన్ అమలుకు పుదుచ్చేరి జిల్లా మెజిస్ట్రేట్ ఎ.కుళొత్తుంగన్ ఆదేశాలు జారీ చేశారని ఆర్ఏఓ మునిస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నిబంధనల ప్రకారం పోలింగ్ జరగడానికి 48 గంటల ముందు పార్టీలు తమ ప్రచారాలను నిలిపివేయాలన్నారు. పోలింగ్ స్టేషన్‌లకు 100 మీటర్ల పరిధిలో సెల్‌ఫోన్లు, కార్డ్‌లెస్ ఫోన్ల వినియోగం అనుమతించమన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి, శాంతిభద్రతలు కాపాడే సిబ్బందికి దీనికి మినహాయింపు ఉందన్నారు. ఎక్కడా ర్యాలీలు, సమావేశాలకు అనుమతి లేదని, పోలింగ్ సర్వేలు, ఒపీనియన్ సర్వేలకు మీడియాకు అనుమతి లేదన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు.

ఎన్నికల ప్రచారం

అంబాజీపేట: కూటమిలోని జనసేన పార్టీ నియోజకవర్గ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాథుర్‌లు వక్కలంకలో ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం నిర్వహించారు. ఉమ్మడి అభ్యర్థులు పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీరుస్తున్న చలివేంద్రాలు

అమలాపురం టౌన్: మండు వేసవిలో వాహన చోదకులు, బాటసారుల దాహార్తిని చలివేంద్రాలు తీరుస్తున్నాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులో మిత్రా సేవా సమితి ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనను మిత్రా సేవా సమితి ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో మిత్రా సేవా సమితి ప్రతినిధులు కొల్లు శ్రీనివాసరావు, దొమ్మేటి రాజేష్, చొడువాడ శంకర్, సూరిశెట్టి అనిల్, షేక్ కన్నా సాహెబ్, జంగా సత్తిబాబు, కరెళ్ల శ్రీను, తణుకు భద్రం తదితరులు పాల్గొన్నారు.